వైభవంగా లక్ష్మీనరసింహస్వామి నిత్యోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 29 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో స్వయంభూ నారసింహుడి నిత్యోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా సాగాయి. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవ, దర్బార్ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా సాగాయి. సుదర్శన నారసింహ హోమం పాంచరాత్రగమశాస్త్రరీతిలో సాగింది. ఉదయం ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి గజవాహన సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. సాయంత్రం అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను కోలాహలంగా నిర్వహించారు. తిరువీధిసేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలోని ఊయలతో శయనింపు చేయించారు. సెలవుదినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ తిరుమాఢవీధులు, క్యూ లైన్లు, క్యూ కాంప్లెక్స్ భక్తులతో రద్దీగా కనిపించాయి. స్వామివారిని సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.43,54,195 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు పేర్కొన్నారు.

ఉత్తర మాఢవీధుల్లో అల్యూమినియం టెంట్‌ను ఏర్పాటు చేస్తున్న ఆలయ సిబ్బంది

భక్తులు వేసవి తాపాన్ని తట్టుకునేలా ఏర్పాట్లు

ఉత్తర మాఢవీధుల్లో తాత్కాలిక అల్యూమినియం టెంట్

యాదగిరిగుట్ట, మార్చి29: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నీడ కోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర మాఢవీధుల్లో తాత్కాలిక అల్యూమినియం జర్మన్ హంగర్ టెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కొండపైన భక్తులు వచ్చే ప్రాంతాలైన ఉత్తర మాఢవీధులను పూర్తిగా కవర్ చేస్తూ 12 ఫీట్ల ఎత్తుతో టెంట్‌ను వేస్తున్నారు. ఇప్పటికే భక్తులు సంచరించే ప్రాంతాల్లో చలువ పందిళ్లతోపాటు మాఢవీధుల్లో కూలింగ్ పెయింట్ వేశారు. తాగునీటి సమస్యలేకుండా చర్యలు చేపట్టారు. తాజాగా ఎండవేడి మరింత పెరగడంతో అల్యూమినియం టెంట్ వేస్తున్నారు. అయితే ఈ టెంట్ కారణంగా ఉత్తర పంచతలరాజగోపురం, అష్టభుజి ప్రాకార మండపంతో పాటు దేవాలయం పూర్తిగా కనిపించదని భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈఓ భాస్కర్‌రావు ఆదేశాల మేరకు వేసవి కాలం ముగిసే వరకు రెండు నెలలు మాత్రమే తాత్కాలిక టెంట్ వేస్తున్నట్లు దేవస్థాన సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. తర్వాత టెంట్‌ను తొలగిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న చేనేత సంఘం జిల్లా నాయకుడు వెంకటేశం

పోచంపల్లిలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

భూదాన్ పోచంపల్లి, మార్చి 29 : పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం మండల కేంద్రంలో చేనేత జిల్లా నాయకుడు తడక వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. యువత క్రీడల్లో రాణించి తమ ప్రాంతానికి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, చేనేత సంఘం జిల్లా నాయకుడు తడక రమేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, నేతాజీ యువజన సంఘం ఉపాధ్యక్షుడు తడక గౌరీశంకర్, నాయకులు కుడికల బలరాం, పాలాది యాదగిరి,

పద్మశాలి యువజన సంఘం గౌరవాధ్యక్షుడు సురపల్లి రాము, అధ్యక్షుడు గంజి యుగేంధర్, ఉపాధ్యక్షుడు రుద్ర చందు, ప్రధాన కార్యదర్శి అడేపు అరవింద్ పాల్గొన్నారు.

చందు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ఆత్మకూరు(ఎం), మార్చి 29 : మండల కేంద్రానికి చెందిన గట్టు చందు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చందు స్నేహితులు(2016–17 పదో తరగతి బ్యాచ్) శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.40వేల ఆర్థికసాయం అందించారు.

ఖాతాదారుల సొమ్ము కొట్టేశాడు

నందికొండ, మార్చి 29 : ఖాతాదారులు డిపాజిట్ చేసిన నగదును వాడుకున్న బ్యాంక్ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ బీసన్న తెలిపారు. విజయపురి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నందికొండ హిల్ కాలనీలోని గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో తిరుమలగిరి మండలం జానారెడ్డి కాలనీకి చెందిన కేతావత్ గిరీశ్ ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. డిసెంబర్ నెలలో బ్యాంకులో ఖాతాదారులు డిపాజిట్ చేసిన 6,57,000 నగదును సొంతానికి వాడుకున్నట్లు బ్యాంక్ అధికారులు గుర్తించి విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గిరీశ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి బ్యాంక్‌లో ఖాతాదారులు డిపాజిట్ చేసిన నగదు సొంతానికి వాడుకున్నట్లు విచారణలో తెలిసింది. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న

అప్‌గ్రేడ్‌కు నోచని పోచంపల్లి పీహెచ్‌సీ

- నేటికీ ఆరు పడకల స్థాయిలోనే వైద్య సేవలు
- వైద్య సిబ్బంది కొరతతో రోగుల అవస్థలు
- అత్యవసర వైద్యానికి ఇతర ప్రాంతాలకు రెఫర్
- ఉత్తమ సేవలకు జాతీయ స్థాయిలో ప్రశంస

పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భూదాన్ పోచంపల్లి, మార్చి 29 : భూదాన్ పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉత్తమ సేవలు అందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కానీ ఆస్పత్రి అప్‌గ్రేడ్ కాక పోవడంతో సౌకర్యాల, సిబ్బంది కొరతతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి స్థాయి ఆరు పడకల నుంచి 30 పడకలకు పెరుగక పోవడంతో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. దాంతో ఆపరేషన్లతో పాటు ఇతర అత్యవసర వైద్య సేవల కోసం రోగులు భువనగిరి, హైదరాబాద్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తున్నది.

24 గంటల ఆస్పత్రిలో ఒకే డాక్టర్

భూదాన్ పోచంపల్లి మండలంలో 51వేలకు పైగా జనాభా ఉంది. 2017లో పోచంపల్లి మున్సిపాలిటీగా అవతరించింది. జనాభా పెరుగుతున్నప్పటికీ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి స్థాయి మాత్రం ఆరుపడకలుగానే ఉంది. పీహెచ్‌సీలో రోజుకు 100కు పైగా ఓపీ నమోదవుతుండగా సిబ్బంది సంఖ్య మాత్రం పెరగడం లేదు. ఆస్పత్రికి కనీసం అంబులెన్స్ సౌకర్యం కూడా లేదు. పేరుకి 24 గంటల ఆస్పత్రి అయినప్పటికీ ఒకే ఒక డాక్టర్ సేవలందిస్తున్నాడు.

సౌకర్యాలు కరువు

పోచంపల్లి పీహెచ్‌సీ కేవలం రక్త, మూత్ర పరీక్షలు, సాధారణ కాన్పులకు మాత్రమే పరిమితమైంది. సిజేరియన్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్, రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి వైద్యం అందించేందుకు సదుపాయాలు లేవు. ఆస్పత్రికి కనీసం వాచ్‌మన్ కూడా లేడు. సరైన మందులు కూడా అందుబాటులో ఉండడం లేదు. దాంతో రోగులు హైదరాబాద్,, చౌటుప్పల్, భువనగిరికి వెళ్తున్నారు. జిల్లాలో భూదాన్ పోచంపల్లి మినహా అన్ని మున్సిపాలిటీలకు 30 పడకల ఆస్పత్రులు ఉన్నాయి. పోచంపల్లి పీహెచ్ సీని కూడా 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య సేవల్లో మిన్న

పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో 2017లో రాష్ట్ర స్థాయిలో కాయకల్ప అవార్డు వచ్చింది. గతేడాది నేషనల్ క్వాలిటీ అనాలిసిస్ బృందం వారు తనిఖీ చేసి జాతీయ స్థాయికి ఎంపిక చేశారు.

అప్‌గ్రేడ్ అయితే మరిన్ని సేవలు

ఆస్పత్రి స్థాయిని 30 పడకల స్థాయికి పెంచితే మరిన్ని ప్రయోజనాలు అందే అవకాశం ఉంది. జనరల్ ఫిజీషియన్, సర్జన్, గైనకాలజిస్ట్, అనస్తీషియా, చిన్నపిల్లల, దంత వైద్యులు అందుబాటులోకి వస్తారు. దాంతో పాటు సిబ్బంది కూడా పెరుగుతారు. మహిళలకు సిజేరియన్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తారు . అన్ని రకాల పరీక్షలు ఇక్కడే నిర్వహించే అవకాశం ఉంటుంది. 24 గంటలు అంబులెన్స్ సౌకర్యం ఉంటుంది.

ఆస్పత్రి అప్‌గ్రేడ్‌కు కృషి

పోచంపల్లి పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన స్థలం అందుబాటులో ఉన్నది. విషయాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుళ్లి ఆస్పత్రి స్థాయిని పెంచేందుకు కృషి చేస్తా. –చిట్టిపోలు విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

మోత్కూరు, మార్చి 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజల కిచ్చిన హామీలను విస్మరించిందని బీఆర్ఎస్ మోత్కూరు మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పనకబండలో నిర్వహించిన బీఆర్ఎస్ గ్రామ శాఖ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని నేటికీ చేయలేదన్నారు. యాసంగి వరి పంట కోతలు మొదలైనప్పటికీ రైతులందరికీ పంట పెట్టుబడి సాయం అందించలేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటకు మద్దతు ధరను చెల్లించాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ప్రతి సీజన్ ప్రారంభానికి ముందే రైతుబంధు డబ్బులు అందించిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు లోతుకుంట స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేశ్, నాయకులు ధనుంజయ్, మహేశ్, మత్స్యగిరి, అంజయ్య, నర్సయ్య, సత్తయ్య, నాగార్జున, రమేశ్ పాల్గొన్నారు.

పనకబండలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

ఆత్మకూరు(ఎం),మార్చి 29 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయనమాట్లాడారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరూ క్యామ మల్లేశం గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కొంత మంది నాయకులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇతర పార్టీల్లోకి మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టం లేదన్నారు. ప్రజలంతా పార్టీ అధినేత కేసీఆర్‌పై నమ్మకంతో ఉన్నారని, వారంతా కారు గుర్తుకు ఓటు వేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చందర్‌గౌడ్, భిక్షపతి, దశరథగౌడ్, బీరప్ప, ఎండీ అజీమొద్దీన్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వెంకన్న

మహాసభలో మాట్లాడుతున్న చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భిక్షపతి

చేనేత పథకాలను కొనసాగించాలి

- చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భిక్షపతి

చౌటుప్పల్‌రూరల్, మార్చి 29 : గత కేసీఆర్ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని జిల్లా చేనేత సహకార సంఘాల అసోసియేషన్ అధ్యక్షుడు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కందగట్ల భిక్షపతి కోరారు. శుక్రవారం చౌటుప్పల్‌లో జరిగిన చేనేత సహకార సంఘం 48వ వార్షిక మహాసభలో ఆయన మాట్లాడారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహాసభను చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బడుగు మాణిక్యం ప్రారంభించగా.. 2023–24 సంవత్సరపు బ్యాలెన్స్ షీట్‌ను సభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం నర్సింహ, మాజీ అధ్యక్షుడు గోషిక చక్రపాణి, పాలక వర్గ సభ్యులు బడుగు అంజయ్య, గోషిక అంజయ్య, గంజి వెంకటేశం, మేనేజర్ రాపోలు శ్రీరాములు, గోషిక ప్రభాకర్, గోషిక ధనుంజయ్య, గోషిక నర్సింహ పాల్గొన్నారు.

కొల్లూరులో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ఆలేరురూరల్, మార్చి 29 : మండలంలోని కొల్లూరు గ్రామంలో పాలసంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దార జోగయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గాజుల వెంకటేశ్, కొరుకొప్పుల కిష్టయ్య, జనగాం వెంకటపాపిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, హోదయ్య, సుధాకర్, మధు, సురేశ్ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లను నిలిపివేయాలి

- ఆటో డ్రైవర్ల డిమాండ్

భువనగిరి అర్బన్, మార్చి 29: కొంత మంది యూనియన్ల పేరుతో ఆటో డ్రైవర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, దానిని తక్షణమే నిలిపి వేయాలని ఆటో డ్రైవర్లు కొంగల రాజు, మండ వెంకటేశ్, జె.జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలు ఆటో సంఘాల నాయకులతో భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణ శివారులో ఇటీవల స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. ఎన్‌హెచ్ 63 నుంచి ఆలయానికి వెళ్లేందుకు పట్టణానికి చెందిన ఆటోలు నడుపుతున్నట్లు చెప్పారు. అయితే కొందరు తాము యూనియన్ ఏర్పాటు చేశామని చెబుతూ ఆలయానికి వచ్చిన ఆటోల నుంచి రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆటో డ్రైవర్లు జి.శ్రీను, బి.ఉప్పయ్య, కొలిపాక బాలరాజు, కె.కుమార్, ఎండీ. మహమూద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గుండాల, మార్చి 29: మండలంలోని నూనెగూడెం గ్రామానికి చెందిన తీరుపల్లి యాదిరెడ్డి(41) శుక్రవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తీరుపల్లి యాదిరెడ్డి కుటుంబ కలహాల నేపథ్యంలో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 24న తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఐలు జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 29 : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి బార్ అసోసియేషన్ కార్యవర్గం ఐక్యంగా కృషి చేయాలని ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను శుక్రవారం భువనగిరి కోర్టు ఆవరణలో సంఘం తరపున అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కోర్టు సముదాయాలకు సొంత భవనాలు, కోర్టుల్లో సరపడా సిబ్బంది, మౌలిక సదుపాయాలు, న్యాయవాదులకు విశ్రాంతి గదులు లేక న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంఘం సభ్యులు సమస్యలను పైస్థాయి జడ్జిల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో పెరుగుతున్న క్రైమ్ రేటును తగ్గించేందుకు బార్, బెంచ్ సమన్వయంతో పని చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు ఉన్నారు.

ఇంటి పన్ను బకాయి వడ్డీపై 90శాతం రాయితీ

ఈ నెల 31లోగా చెల్లించిన వారికే అవకాశం : మున్సిపల్ కమిషనర్

బొడ్రాయిబజార్, మార్చి 29 : ఇంటి పన్ను బకాయిలను వెంటనే చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. సూర్యాపేట పట్టణ గృహ, వ్యాపార, వాణిజ్య యజమానులు ఈ నెల 31లోగా బిల్ కలెక్టర్‌లకు, మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించి రాయితీ పొందాలని పేర్కొన్నారు. దాంతో పాటు నల్లా బిల్లు, ఎంక్రోచ్‌మెంట్ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ ఫీజు కూడా చెల్లించాలని కోరారు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

బంగారు పుస్తెలతాడు చోరీ

మోత్కూరు, మార్చి 29 : మోత్కూరుకు చెందిన గడ్డం యాదమ్మ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వృద్ధురాలు గడ్డం యాదమ్మ రాత్రి తన ఇంట్లో ఆరుబయట ఒంటరిగా నిద్రించింది. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. తెల్లారుజామున నిద్రలేచిన యాదమ్మ మెడలో పుస్తెల తాడు లేక పోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించింది. కుటుంబ సభ్యుల సహకారంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హనుమాన్‌పురంలో..

భువనగిరి కలెక్టరేట్, మార్చి 29: మహిళ మెడలోంచి నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకొని పోయినా సంఘటన మండలంలోని హనుమాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాపురం గ్రామానికి చెందిన రంగనీలమ్మ తన ఇంటి సమీపంలో నిలబడి తోటి మహిళలతో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి నీలమ్మ మెడలోని నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. అతడిని పట్టుకునేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. బాధిత మహిళ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కరుణామయుడి స్మరణలో..

- చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు
- ఏసుక్రీస్తుకు సిలువ వేసిన ఘట్టాల ప్రదర్శన

భువనగిరి అర్బన్, మార్చి 29: గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని మన్నా చర్చి, గాస్పల్ చర్చితో పాటు జిల్లాలోని అన్ని చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీస్తును స్మరించుకున్నారు.

పోచంపల్లిలో..

భూదాన్ పోచంపల్లి : మున్సిపల్ కేంద్రంలోని గిల్గాలు, బాప్టిస్ట్ చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు బైబిల్‌లోని బోధనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు తిమోతీ, జాకబ్ రాజ్, డేవిడ్, ఇజ్రాయిల్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



గుండాల : విశ్వవాణి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రీస్తు శిలువ ఘట్టాల ప్రదర్శన

గుండాల : మండల కేంద్రంలోని విశ్వవాణి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ లాజరస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తుకు సిలువ వేసిన రోజు ప్రాముఖ్యతను క్రైస్తవులకు తెలిపారు. ఈస్టర్ ఆదివారానికి ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు అబ్రహం, రమేశ్, అనిల్, శాంతమ్మ, లూథియా, యాదమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

ఆత్మకూరు(ఎం), మార్చి 29 : గ్రామ పంచాయతీ ప్రజలు పరిశుభ్రత పాటించాలని ఆత్మకూరు(ఎం) పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టిన పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రతి రోజూ ఇంటికి వచ్చే గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని సూచించారు. ప్రతి రోజు మురుగు కాల్వలను, వీధులను శుభ్రం చేయాలని, కాల్వల వెంట ఉన్న కలుపు మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు.

ఎస్ఐ విజయ్‌కుమార్‌కు సన్మానం

వేములపల్లి, మార్చి 29 : మండలంలోని ఆమనగల్లు గ్రామంలో పార్వతీ రామలింగేశ్వరస్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 23 నుంచి 26 వరకు విజయవంతంగా జరిగాయి. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా బందోబస్తు నిర్వహించి సహకారం అందించిన ఎస్ఐ డి.విజయ్‌కుమార్‌ను ఆలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకన్న, నాయకులు సందీప్‌నాయుడు, వినయ్, సతీశ్, జోజి, ఎల్లయ్య, లింగారెడ్డి, కృష్ణయ్య, గంగయ్య, శంకర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తిరుమలగిరి (సాగర్), మార్చి 29 : మండలంలోని నాగార్జునపేట, జమ్మనకోట గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఆర్‌పీఎఫ్ జవాన్ లక్ష్యా నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి వచ్చిపోయే ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా తనవంతుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశానన్నారు.